వేసవిలో నీటి ఎద్దడి రాకుండా..

- దేవరకొండ మున్సిపాలిటీలో ప్రత్యేక ప్రణాళిక సిద్ధం
- ఇప్పటికే పనిచేయని బోర్లు, చేతిపంపులకు మరమ్మతులు
- పట్టణ జనాభాకు సరిపడా నీరందించేలా చర్యలు



దేవరకొండలో మున్సిపల్ బోరును కడిగిస్తున్న సిబ్బంది

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రస్తుత వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. పట్టణ జనాభాకు తగ్గట్టుగా ప్రజలకు తాగునీటిని అందించేలా మున్సిపల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పట్టణంలో తాగునీటి సమస్య ఉన్న కాలనీలు, మరమ్మతులకు గురైన బోర్లు, పట్టణానికి అవసరమైన తాగునీటి సరఫరా వంటి అంశాలపై దృష్టి సారించారు.

50 వేలకుపైగా జనాభా..

దేవరకొండ మున్సిపాలిటీలో అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 30వేల జనాభా ఉన్నప్పటికీ ప్రస్తుతం 50వేల పైచిలుకు చేరినట్లు అంచనా. ఇందుకు గాను ప్రతి ఒక్కరికీ రోజు వారీగా 135 లీటర్ల తాగునీటిని అందించాల్సి ఉంది. అందుకు తగ్గట్టుగా మున్సిపల్ యంత్రాంగం ముందుకెళ్తోంది. మిషన్ భగీరథలో భాగంగా మొత్తం ఆరు ట్యాంకులు నిర్మించగా అందులో నాలుగు ఓహెచ్ఎస్ఆర్, రెండు జీఎల్ఎస్ఆర్ ఉన్నాయి. వాటి నుంచి తాగునీటి సరఫరా నిమిత్తం పట్టణంలో మొత్తం 127 కిలోమీటర్ల మేర మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నారు.

బోర్ల మరమ్మతులపై దృష్టి

దేవరకొండ మున్సిపాలిటీలో జనాభాకు తగ్గట్టుగా తాగునీటిని అందించేందుకు అధికారులు మరమ్మతులకు గురైన బోర్లు, నీటి సరఫరాపై దృష్టి కేంద్రీకరించారు. ప్రస్తుత వేసవిలో పట్టణ జనాభాకు 5.2 మిలియన్ లీటర్స్ ఫర్ డే (ఎంఎల్‌డీ) నీరు అవసరం ఉండగా ప్రస్తుతం 4.2 ఎంఎల్‌డి నీరు పీఏపల్లి మండలం పరిధిలోని కోదండాపురం ప్లాంట్ నుంచి పట్టణానికి సరఫరా అవుతోంది. త్వరలోనే మరో ఎంఎల్‌డీ నీరు పట్టణానికి సరఫరా కానున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. పట్టణంలో 89 బోరు మోటార్లతో పాటు 25 చేతిపంపులు కూడా పనిచేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 25 చేతిపంపుల్లో రెండు మరమ్మతులకు గురికాగా బుధవారం వాటిని కూడా మరమ్మతులు చేయించారు. వేసవిలో ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పట్టణ జనాభాకు తగ్గట్టుగా నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. పనిచేయని బోరు మోటార్లు, చేతిపంపులను మరమ్మతులుచేయించాం. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవరకొండ మున్సిపాలిటీలో వేసవిలో నీటి ఎద్దడి రాకుండా సరఫరా చేసేలా అప్రమత్తంగా ఉన్నాం.

– రాజు, మున్సిపల్ ఏఈ, దేవరకొండ

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- దేవరకొండ ఏఎస్పీ మౌనిక



రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ మౌనిక

గుర్రంపోడు : ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని దేవరకొండ డీఎస్పీ పి.మౌనిక అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకై పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాహనాల డ్రైవర్లకు, పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి తమ కుటుంబాలకు దూరంకావద్దని, ప్రమాదాలు జరగకుండా పరిమిత వేగంతో ప్రయాణించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించడం ప్రమాదకరమన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని సూచించారు. అతి వేగం ప్రమాదాలకు కారణమని, అతివేగంతో నడిపితే ప్రమాదాలు జరిగి ఎదుటివారి ప్రాణాలు పోవడానికి కారణమవుతారని అన్నారు. 18 సంవత్సరాల లోపు వారు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని, ఆ తర్వాత మేజర్లు అయినా మూడేళ్ల వరకు లైసెన్స్ రాదన్నారు. ద్విచక్రవాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. విద్యార్థులు బాగా కష్టపడి చదువుకుని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి వ్యసనాలకు గురికావద్దన్నారు. ఈ సందర్భంగా పోలీసు కళాబృందంచే నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది.

సీపీఆర్‌పై అవగాహన..

ఆకస్మికంగా గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ చేసి ఎలా ప్రాణాలు కాపాడవచ్చునో డెమో ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెడ్‌నర్స్ శారదాకుమారి అవగాహన కల్పించారు. సమావేశంలో సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ పసుపులేటి మధు, ప్రిన్సిపాల్ జి.రాగిణి, పీహెచ్ఎన్ శారదాకుమారి, వాహనాల డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని బోయగూడెంలో ఈ నెల 7న మేము సైతం మీ కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన శివకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పరిసర గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించేందుకు తమ ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట యశోద హాస్పిటల్, లైయాన్స్ ఐ హాస్పిటల్, శ్రీలక్ష్మీ డెంటల్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు పగిడిమర్రి కోటేష్, సాయి, తేనాలి సైదిరెడి తదితరులు ఉన్నారు.

ఆదరణను చూసి ఓర్వలేక విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న ధనావత్ సిద్దూనాయక్

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడంతో ప్రజల నుంచి పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తున్నారని జిల్లా గిరిజన నేత, కాంగ్రెస్ నాయకుడు ధనావత్ సిద్దూనాయక్ అన్నారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 కే గ్యాస్ అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ పథకాలను అమలు చేయలేదని, కనీసం ఉచిత విద్యుత్ కూడా అందించలేకపోయిందన్నారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్ చేసే అసత్యపు ప్రచారాలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నాగునాయక్, బంటు కిరణ్, కందుల నర్సిరెడ్డి, గాలం వెంకన్న యాదవ్, రవితేజనాయక్, గాలం వేణు, వంశీ నాయక్, బాలునాయక్, మోహన్‌నాయక్, మోహన్‌రెడ్డి, శివనాయక్, కోటిరెడ్డి, సైదానాయక్, మంగ్తనాయక్, కిషన్‌నాయక్, సురేష్, సురేష్‌నాయక్, మస్తాన్ నాయక్, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ రాజు

డిండి : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో బుధవారం సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజు మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం ఖాతాల దుర్వినియోగం తదితర అంశాలపై వివరించారు. ఎవరైనా మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, బిచ్చయ్య, రామారావు, శ్రీలత, రమ, సుశీల, రుమ్‌షా తదితరులు పాల్గొన్నారు.

డప్పు ప్రదర్శన

కొండమల్లేపల్లి : ఎమ్మార్పీఎస్ కొండమల్లేపల్లి మండల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద డప్పు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీను మాట్లాడారు. ఎస్సీలకు రావాల్సిన వాటా శాస్త్రీయ బద్ధంగా అందించాలన్నారు. ఈ నెల 14న మంద కృష్ణ మాదిగ నల్లగొండకు వస్తున్న సందర్భంగా ఆయన పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోడ సునీల్, గడ్డం శ్రీరాములు, పంది రుద్రమ్మ, శ్రీను, రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితేనే విజయం

మిర్యాలగూడ అర్బన్ : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితేనే విజయం సాధ్యమవుతుందని ఎంఈఓ బాలునాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని బంగారుగడ్డ ఉన్నత పాఠశాలలో జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో జనమైత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండి.మునీర్, బాలాజీనాయక్, షేక్ అహ్మద్, అధ్యాపకులు రాంసింగ్, ఎల్లమ్మ, రజని, లక్ష్మి, శ్రీనివాస్, సైదిరెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

కేవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

మిర్యాలగూడ టౌన్ : బి.అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు కేవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ నిర్వాహకుడు కాతోజు వినోద్‌కుమార్ బుధవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపయ్యనాయక్, రత్నాకర్‌రెడ్డి, పి.సైదయ్య, మంగ్త, శ్రీనివాస్, ఉస్మాన్, వెంకటేశ్వర్లు, సైదిరెడ్డి, మోహన్‌బాబు, అనిల్‌కుమార్, పుష్పలత, లింగంపల్లి చిరంజీవి, సింగం సత్యనారాయణ పాల్గొన్నారు.

భూమిలేని పేదలందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలి

పెద్దఅడిశర్లపల్లి : జాబ్ కార్డుతో సంబంధం లేకుండా భూమిలేని పేదలందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పని ప్రదేశంలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యల గూర్చి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ కూలీలకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కావలి కృష్ణయ్య, అవలీల, కోటేష్, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



మిర్యాలగూడ : నేతాజీ స్కూల్‌లో స్వపరిపాలన వేడుకలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని హౌజింగ్ బోర్డులో గల నేతాజీ స్కూల్‌లో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు.. ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పలువురు అధికారుల పాత్రలో అలరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ బాలునాయక్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీపతి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు బీమ్లానాయక్, టీచర్లు నూరి, అలివేలు, సునిత, కళ్యాణి, జబీన్, వసంత, సామ్యూల్, శోభ, సత్యం, సైదమ్మ తదితరులు ఉన్నారు.

అడవిదేవులపల్లి : మండలంలోని కొత్తనందికొండ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా, రాజకీయ నాయకులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యాయులు కొర్ర శ్రీనివాస్, అద్దంకి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : తేనపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పాశం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు చింతరెడ్డి శశిధర్‌రెడ్డి, మనిత, జ్యోతి, మనోరమ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి పాఠశాలలో..

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులుగా వివిధ హోదాల్లో ఒక రోజు విధులను నిర్వహించారు. కాగా స్వపరిపాలన దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీఓ బాలరాజురెడ్డిలు విద్యార్థులను అభినందించి, జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.



అడవిదేవులపల్లి : కొత్తనందికొండలో..



గుర్రంపోడు : తేనపల్లి ప్రాథమిక పాఠశాలలో..

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం



మిర్యాలగూడలోని సినాప్సి కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ టౌన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో సాకేత, కేఎల్ఎన్, శ్రీగౌతమి, వాగ్దేవి, సినాప్సి, ఎస్సీ గురుకుల ఆశ్రమ పాఠశాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్లలో మొదటి రోజు ఫస్టియర్ విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాశారు. ఆయా పరీక్ష కేంద్రాలను సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, తహసీల్దార్ హరిబాబు తనిఖీ చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయడంతో పాటు పోలీస్ బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు. వారి వెంట టూటౌన్ సీఐ నాగార్జున తదితరులు ఉన్నారు.

త్రిపురారం : మండలంలోని బాబుసాయిపేట రోడ్డులో గల మోడల్‌స్కూల్ కంపాసాగర్‌లో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులు, తెలుగు, సంస్కృతం పరీక్షలు రాశారు. మండలంలో 310 మంది విద్యార్థులకు 300మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

హాలియా : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం పరీక్షలు నిర్వహించారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో 261మంది విద్యార్థులకుగాను 238మంది హాజరుకాగా ఐదుగురు జనరల్ విద్యార్థులు, 18 మంది ఒకేషనల్ విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. అదే విధంగా కేజీబీవీ పాఠశాల్లో 172 మంది విద్యార్థులకు గాను 167మంది పరీక్షకు హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ లింగస్వామి తెలిపారు.

చింతపల్లి : మండల కేంద్రంలోని ఆలూకా జైహింద్ రెడ్డి జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పరీక్షల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ నెల 5 నుంచి 22వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. 216 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా 210మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రామస్వామి, డిపార్ట్‌మెంటల్ అధికారి వెంకటయ్య తెలిపారు.

కొండమల్లేపల్లి : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. కొండమల్లేపల్లిలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 328 మంది విద్యార్థులకు గాను 294 మంది హాజరయ్యారు. శ్రీ క్రాంతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 179 మంది విద్యార్థులకు గాను 178 మంది హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు.

ఉద్యమకారులకిచ్చిన హామీలను నెరవేర్చాలి



అమరవీరుల స్థూపం వద్ద కార్డులను చూపిస్తున్న ఉద్యమకారులు

నాగార్జునసాగర్ : అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఉద్యమకారులకిచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యమకారుల సంఘం రాష్ట్ర నాయకురాలు జానకిరెడ్డి కోరారు. సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ పిలుపుమేరకు పోస్టు కార్డు ఉద్యమంలో భాగంగా బుధవారం స్థానిక పైలాన్‌కాలనీలోని తెలంగాణ స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఇచ్చిన హామీల మేరకు ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలం, రూ.25వేల పెన్షన్, హెల్త్‌కార్డు, ఉచిత బస్‌పాస్‌లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నందికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రమేశ్‌జీ, చంద్రమౌళి, గెజ్జల కొండలు, సల్లోజు శేఖరాచారి, లక్ష్మణ్‌నాయక్, పందిర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు అప్పగించడంలో నిర్లక్ష్యం

- సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి విమర్శ



సీపీఎం బృందానికి ఇళ్ల పట్టాలు చూపిస్తున్న లబ్ధిదారులు

త్రిపురారం : అర్హులైన పేద లబ్దిదారులకు ఇళ్ల స్థలాలను అప్పగించకుండా పట్టా కాగితాలు పంచి చేతులు దులుపుకున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి విమర్శించారు. ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో నిడమనూరు మండలంలోని ముకుందాపురంలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 840లో సుమారు 37 మందికి 75 గజాల చొప్పున 2023 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వంలోని ఎమ్మెల్యే హడావుడిగా ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసి స్థలం అప్పగించలేదన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పేదలను పట్టించుకోకపోతే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, నిడమనూరు మండల కార్యదర్శి కందుకూరి కోటేష్, నాయకులు, స్థానికులు కత్తి లింగారెడ్డి, కోమండ్ల గురువయ్య, నల్లబోతు సోమయ్య, మలికంటి చంద్రశేఖర్, సదర్శన్, కుంచె శేఖర్, యశోద పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు

- జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి

కొండమల్లేపల్లి : వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నీటి సరఫరా అంశంపై మిషన్ భగీరథ అధికారులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నర్సరీల్లోని మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ బాలరాజురెడ్డి, ఏపీఓ రామచంద్రనాయక్, మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరుగా ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరణ వాహనం వచ్చినప్పుడు సిబ్బందికి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో చెత్త సేకరణను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు రోడ్లపై చెత్త వేయొద్దన్నారు. ఆస్తి, నల్లా పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఉన్నారు.

చందంపేటలో ఉపాధి హామీ ఓపెన్ ఫోరం



మాట్లాడుతున్న అడిషనల్ పీడీ నవీన్‌కుమార్

చందంపేట : చందంపేట మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఓపెన్ ఫోరంలో రూ.8లక్షల రికవరీకి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు ఓపెన్ ఫోరంకు హాజరైన అడిషనల్ పీడీ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల్లో అవినీతికి ఆస్కారం లేకుండా చేపట్టాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అవి నీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీవీవో వేణుగోపాలచారి, ఏపీడీ యామిని, ఎంపీడీవో లక్ష్మి, ఏపీవో వరలక్ష్మి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మోసం



డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

గుర్రంపోడు : మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగులవంచ తిరుపతిరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ డైరీని, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఇప్పటికీ నాలుగో విడుత రుణమాఫీ కాలేదని, రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. రైతు భరోసాను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పామనగుండ్ల వెంకన్న, నాయకులు మేకల వెంకట్‌రెడ్డి, నాగులవంచ నాగేశ్వర్‌రావు, కామెల్ల రాములు, షేక్ సిరాజ్, నగేష్, శ్రీనివాసాచారి, వనమాల మహేందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై స్పష్టతనివ్వాలి



మాట్లాడుతున్న బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ టౌన్ : రైతు భరోసా పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం రైతులకు స్పష్టతనివ్వాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. బుధవారం మిర్యాలగూడలోని మహాత్మా జ్యోతిరావ్ పూలే బీసీ భవనంలో జరిగిన బీసీ సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను పూర్తిస్థాయిలో అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, రైతు భరోసా జమ చేయకుంటే రైతులు తిరగబడతారని అన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు దాసరాజు జయరాజు, సిద్దం రాజు, నాయిని భాస్కర్, గంగాధర్, అంజి గౌడ్, ఉపేందర్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

8,9 తేదీల్లో స్పోర్ట్స్ మీట్

దేవరకొండ: దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో ఈనెల 8,9 తేదీల్లో దేవరకొండ పట్టణంలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌విటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 20–విభాగంలో కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్, వాలీబాల్, రన్నింగ్ పోటీలు మహిళలకు మాత్రమే నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారిణులు అసోసియేషన్ భవనం సెల్ :9440433985, 9848759285 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఏకలవ్య పాఠశాల ఏర్పాటు చేయాలి

దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గంలో ప్రభుత్వం ఏకలవ్య పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ యువజన కాంగ్రెస్ నాయకులు బుధవారం దేవరకొండ పరిధిలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాల సందర్శనకు వచ్చిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ శరత్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కొర్ర రాంసింగ్ మాట్లాడుతూ దేవరకొండ ప్రాంతంలో ఏకలవ్య పాఠశాలను ఏర్పాటు చేస్తే ఇక్కడి పేద విద్యార్థులకు సెంట్రల్ సిలబస్ అందుబాటులోకి వస్తుందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్రీనునాయక్, కిషన్‌బావోజీ ఉన్నారు.

జాతీయ సదస్సుకు ఎంపిక

దేవరకొండ : భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయంలో దక్షిణ భారత జానపద, గిరిజన సంప్రదాయ రాతప్రతులు అనే అంశంపై జరిగే జాతీయ సదస్సులో పాల్గొనేందుకు దేవరకొండకు చెందిన పంబాల పర్వతాలు ఎంపికయ్యారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం తరఫున జాతీయ సదస్సులో పాల్గొనే తాను గిరిజన తాళపత్ర గ్రంథాలను సంరక్షించడం– సాంస్కృతిక, చారిత్రక మనుగడ–ఆవశ్యకత అనే అంశంపై ప్రసంగించనున్నట్లు బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా ఫ్రూట్స్ ఫెస్టివల్

పెద్దఅడిశర్లపల్లి : మండల కేంద్రంలోని శ్రీసాయి కృష్ణవేణి పాఠశాలలో బుధవారం ఫ్రూట్స్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫ్రూట్స్ వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చంద్రారెడ్డి, ఉపాధ్యాయులు సైది బాబు, వెంకట్, మహేష్, ప్రేమ్, నీరజ, జ్యోతి, కుర్షీద్, శోభారాణి, ఆయేషా, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

మిర్యాలగూడ అర్బన్ : వేములవాడలోని మంజునాథ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించబోయే దళిత హక్కుల పోరాట సమితి సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వలపట్ల వెంకన్న పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో రాష్ట్ర సమావేశాల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అందుగుల సైదులు, కొండేటి విజయ్, సుందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా సాయిలు

డిండి : భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బూషిపాక సాయిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా ఎలిమినేటి దేవయ్య, ఉపాధ్యక్షులుగా నాగయ్య, ప్రవీన్, తిర్పతయ్య, సహాయ కార్యదర్శులుగా సత్తయ్య, చెన్నయ్య, జమ్ములు, కోశాధికారిగా శ్రీనుతోపాటు 21 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కుపాసిపల్లి వాసికి డాక్టరేట్



పేర్ల బాలు

హాలియా : మండలంలోని కుపాసిపల్లి గ్రామానికి చెందిన పేర్ల బాలు ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎకనామిక్స్ విభాగంలో డాక్టరేట్ పొందారు. ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడి, ఐసిఎస్ఎస్ఆర్–ఎస్ఆర్‌సి డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో, ప్రొఫెసర్ కె.అంజిరెడ్డి సూచనలతో 'ఫైనాన్స్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ తెలంగాణ స్టేట్ – ఏ కేస్ స్టడీ ఆఫ్ రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజు ఆఫ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్' అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ కోరారు. ఎల్ఆర్ఎస్‌పై రాయితీ బ్యానర్లను బుధవారం పట్టణంలోని ప్రధాన సెంటర్లలో ఏర్పాటు చేయించి మాట్లాడారు. ఈనెల 31వ తేదీ వరకు తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునే యాజమానులకు 25 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. 2020 సంవత్సరంలో ఎల్ఆర్ఎస్ కోసం వెయ్యి రూపాయలు చెల్లించి రిజిస్టర్ చేయించుకున్న ప్లాట్ల యజమానులు రెగ్యులరైజ్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు మున్సిపాలిటీలో హెల్ప్‌లైన్ డెస్క్‌ను సంప్రదించాలని, సమాచారం కోసం సెల్ నంబర్లు 9966550549, 9885004218 సంప్రదించాలని కోరారు. ఆయన వెంట టీపీఓ సోమయ్య, టీపీఎస్ అంజయ్య తదితరులు ఉన్నారు.